

బీఆర్‌ఎస్ పాలనలో అన్యాయం
బీఆర్‌ఎస్ పాలనలో మాదిగలకు అన్యాయం జరుగుతోందని ఎమ్మార్పీఎస్ నేత మంద కృష్ణమాదిగ అన్నారు. - 8లో



అగ్రస్థానంలో తెలంగాణ పోలీస్
శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీస్ అగ్రస్థానంలో ఉందని సీపీ దేవేంద్రసింగ్ చౌహాన్ అన్నారు. - 10లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 35°/27°
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఈదురు గాలులతో జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్, ముగ్గురు ఆర్డీఓలు బదిలీ

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)తోపాటు సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ రెవెన్యూ డివిజన్ అధికారుల (ఆర్డీఓల)ను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారి స్థానంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా ఎ.వెంకట్‌రెడ్డి, సూర్యాపేట రెవెన్యూ డివిజన్ అధికారిగా వీర బ్రహ్మచారి, కోదాడ రెవెన్యూ డివిజన్ అధికారిగా సూర్యనారాయణ, హుజూర్‌నగర్ రెవెన్యూ డివిజన్ అధికారిగా జగదీశ్వర్‌రెడ్డిలను నియమించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న మోహన్‌రావులతో పాటు సూర్యాపేట ఆర్డీఓ రాజేంద్రకుమార్, కోదాడ ఆర్డీఓ కిషోర్‌కుమార్, హుజూర్‌నగర్ ఆర్డీఓ వెంకారెడ్డిలకు ఎలాంటి పోస్టింగ్‌లు ఇవ్వకుండా వెయిటింగ్‌లో ఉంచారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



బాలికల పఠన సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఆర్‌సీఓ

నడిగూడెం : గురుకులాల్లో ఈ విద్యా సంవత్సరం పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో వంద శాతం ఫలితాల సాధనకు ఉపాధ్యాయ, అధ్యాపకులు కృషిచేయాలని సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ ఉమ్మడి జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ హెచ్.అరుణకుమారి కోరారు. శుక్రవారం నడిగూడెం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు తమవంతు సేవ చేయాలన్నారు. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థినులను తమ సొంత బిడ్డల్లాగా చూసుకోవాలన్నారు. ఆమె వెంట ప్రిన్సిపాల్ సీహెచ్.ధనవిజయలక్ష్మి, వైస్‌ప్రిన్సిపాల్ వసంత, రేణుక, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

డీఈఓను సస్పెండ్ చేయాలి

సూర్యాపేట టౌన్: ఉపాధ్యాయుల డిప్యుటేషన్ విషయంలో లంచాలకు పాల్పడిన డీఈఓను వెంటనే సస్పెండ్ చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వీరబోయిన లింగయ్య యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. మోతె మండలం ఉర్లుగొండ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన హెచ్‌ఎం, ఉపాధ్యాయురాలిపై గతేడాది నవంబర్‌లో వచ్చిన ఆరోపణల్లో భాగంగా విచారణ చేపట్టి ఆ ఉపాధ్యాయురాలిని నేరేడుచర్లకు డిప్యుటేషన్‌పై పంపారని తెలిపారు. అయితే వారి వద్ద నుంచి డీఈఓ రూ.లక్షల్లో లంచం తీసుకొని మళ్లీ ఉర్లుగొండ పాఠశాలకు వేశారని ఆరోపించారు. దీంతో ఆ పాఠశాలకు గ్రామస్తులు తమ పిల్లలను పంపించడం లేదని, గతేడాది 90 మంది విద్యార్థులుంటే ఈ ఏడాది 41 మంది మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

18 నుంచి మూసీ నీటి విడుదల

కేతేపల్లి : జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత అతిపెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాల్వలకు ఈ నెల 18వ తేదీ నుంచి నీటిని విడుదల చేయనున్నట్లు జిల్లా నీటిపారుదల శాఖ ఈఈ భద్రునాయక్ శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. మూసీ ఆయకట్టు పరిధిలో వానాకాలం పంటల సాగుకు నాలుగు విడతలుగా నీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ఆదేశాల మేరకు నీటి విడుదలపై నిర్ణయం తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు.

పట్టణాల్లో 'అమృత్'

- మున్సిపాలిటీల్లో రాబోయే 30 సంవత్సరాల్లో జనాభాకు సరిపడా తాగు నీరిచ్చేలా ప్రణాళిక
- రూ.491.39 కోట్లతో మిషన్ భగీరథ–అర్బన్ 2.0
- ఉమ్మడి జిల్లాలోని 17 మున్సిపాలిటీల్లో అమలుకు శ్రీకారం
- దేవరకొండ, హుజూర్‌నగర్‌లో పనులకు రూ.74.08 కోట్లతో ప్రతిపాదనలు
- ఐదేళ్లపాటు నిర్వహణ బాధ్యత కాంట్రాక్టు సంస్థదే..



మున్సిపాలిటీల్లో తాగునీటి పథకాలకు కేటాయించిన నిధులు మొత్తం రూ. 491.39 కోట్లు

మున్సిపాలిటీ	నిధులు (రూ. కోట్లలో)		
చిట్యాల	12.50	తిరుమలగిరి	30.00
చండూరు	9.80	కోదాడ	25.80
హాలియా	15.30	సూర్యాపేట	45.00
నకిరేకల్	25.00	ఆలేరు	12.00
నందికొండ	44.00	చౌటుప్పల్	21.00
నల్లగొండ	56.75	మోత్కూరు	12.00
మిర్యాలగూడ	93.30	పోచంపల్లి	17.50
నేరేడుచర్ల	11.00	యాదగిరిగుట్ట	38.64
		భువనగిరి	21.80

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : మున్సిపాలిటీల్లో తాగునీటి సమస్యకు శాశ్వతంగా చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాబోవు 30 ఏళ్లలో పెరగనున్న జనాభాను అంచనా వేసుకొని దానికి తగ్గట్టుగా తాగునీటి ప్రాజెక్టులకు ప్రణాళికలు రూపొందించింది. ఉమ్మడి జిల్లాలో 19 మున్సిపాలిటీలు ఉండగా 17 మున్సిపాలిటీల్లో కేంద్ర ప్రభుత్వ సహకారంతో మిషన్ భగీరథ – అర్బన్ 2.0 (అమృత్) పథకం ద్వారా తాగునీటి ప్రాజెక్టులను నిర్మించాలని నిర్ణయించింది. ఈ పథకంలో భాగంగా ఇంటింటికి నల్లా కనెక్షన్లు, కొత్త పైపులైన్ల ఏర్పాటు, నీటి ట్యాంకుల నిర్మాణం చేపట్టనున్నారు.

తీరనున్న తాగునీటి సమస్య..
ఉమ్మడి జిల్లాలోని అనేక మున్సిపాలిటీల్లో వేసవి కాలం వచ్చిందంటే తాగునీటి సమస్య జఠిలంగా మారుతోంది. కొత్తగా మున్సిపాలిటీలు ఏర్పడడం, పాత మున్సిపాలిటీల్లో సమీప గ్రామాలను విలీనం చేయడం, పట్టణాల్లో ఏటేటా పెరుగుతున్న జనాభా, భవన నిర్మాణాలతో తాగునీటి సమస్య తలెత్తుతోంది. ప్రస్తుతం ఆయా మున్సిపాలిటీల్లో ఉన్న ట్యాంకుల కెపాసిటీ సరిపోకపోవడం, కాలనీలలో పూర్తిస్థాయిలో అంతర్గత పైప్‌లైన్‌లు లేకపోవడం వల్ల ఇబ్బందులు సమస్యలు వస్తున్నాయని గుర్తించిన ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం 2.0 అమలు చేయాలని నిర్ణయించింది.

ఆన్‌లైన్ విధానంలో నీటి సరఫరా, పర్యవేక్షణ
గతంలో మాదిరిగా కాకుండా కొత్త టెక్నాలజీ ద్వారా తాగునీటిని సరఫరా చేయనున్నారు. జిల్లాల్లోని మున్సిపల్ కార్యాలయాల్లో స్కాడా పేరుతో కంప్యూటర్లను ఏర్పాటు చేయనున్నారు. పట్టణాల్లోని ప్రధాన ట్యాంకుల ద్వారా ఎప్పుడు ఎంత తాగునీటిని విడుదల చేస్తున్నారో.. పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా తెలుసుకునే విధానాన్ని అమలు చేయనున్నారు. దీంతో నీటి సరఫరాలో ఏర్పడే అంతరాయాన్ని కూడా సులభంగా తెలుసుకోవడం వీలవుతుందని అధికారులు చెబుతున్నారు.

ఐదేళ్లు ప్రజారోగ్య శాఖ పర్యవేక్షణ
ఇప్పటివరకు మున్సిపాలిటీల్లో తాగునీటి పథకాలు పూర్తి చేసిన వెంటనే మున్సిపాలిటీలకు అప్పగించేవారు. దీంతో క్షేత్రస్థాయిలో పైప్‌లైన్ల లీకేజీ, పైపులు పగిలిపోవడం వంటి సమస్యలు వస్తున్నాయి. కొత్త విధానంలో ప్రాజెక్టు పనులు పూర్తయిన తర్వాత ప్రజారోగ్య శాఖ పర్యవేక్షణలో సంబంధిత కాంట్రాక్టు సంస్థనే ఐదేళ్ల పాటు నిర్వహణ చూసుకోవాల్సి ఉంటుంది. దీంతో తాగునీటి సరఫరాలో లోపాలు జరిగితే సరిదిద్దడం, మరమ్మతు చేయడం వంటికి కాంట్రాక్టు సంస్థనే చూసుకునేలా నిబంధనలు రూపొందించారు.

టెండర్ దశలో..
ఉమ్మడి జిల్లాలోని 17 మున్సిపాలిటీల్లో తాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ప్రజారోగ్య శాఖ అధికారులు ఇటీవల టెండర్లు పిలిచారు. ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే ఈ టెండర్లు వచ్చే నెల మొదటి వారంలో ఓపెన్ చేసి నిబంధనల ప్రకారం కాంట్రాక్టు సంస్థలను ఎంపిక చేయనున్నారు.

టెండర్లు పూర్తి కాగానే పనులు ప్రారంభిస్తాం
"ఉమ్మడి జిల్లాలోని 17 మున్సిపాలిటీల్లో తాగునీటి ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం రూ.491.39 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే వీటికి సంబంధించి టెండర్లు పిలిచాం. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే అన్ని మున్సిపాలిటీల్లో పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటాం. హుజూర్‌నగర్, దేవరకొండ మున్సిపాలిటీలకు సంబంధించి డీపీఆర్ తయారు చేసి ప్రభుత్వానికి పంపాం."
– కందుకూరి వెంకటేశ్వర్లు, ఎస్‌ఈ, ప్రజారోగ్య శాఖ

హుజూర్‌నగర్, దేవరకొండకు ప్రతిపాదనలు
ఉమ్మడి జిల్లాలోని 17 మున్సిపాలిటీలకు ఈ ప్రాజెక్టులు మంజూరయ్యాయి. హుజూర్‌నగర్, దేవరకొండ మున్సిపాలిటీలకు సంబంధించి అధికారులు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. హుజూర్‌నగర్ పట్టణానికి రూ.61.75 కోట్లు, దేవరకొండ పట్టణానికి రూ.12.33 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. రెండో విడతలో ఈ రెండు మున్సిపాలిటీలకు నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది.



ఆర్యవైశ్యుల సంఘం ప్రముఖుల ఇష్టాగోష్టిలో మాట్లాడుతున్న మంత్రి జగదీష్‌రెడ్డి

పోరాటాల పురిటిగడ్డ సూర్యాపేట

- ఆర్యవైశ్యుల ఇష్టాగోష్టిలో విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట): ప్రజా పోరాటాలకు పురిటిగడ్డ సూర్యాపేట అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతి ఉద్యమం వెనుక వ్యాపార వర్గాలు (ఆర్యవైశ్యులు) కీలక పాత్ర పోషించాయని ఆయన ప్రసంశించారు. శుక్రవారం సూర్యాపేటలో ఆర్యవైశ్య ప్రముఖులతో ఇష్టా గోష్ఠిగా జరిగిన సమావేశంలో మంత్రి జగదీష్‌రెడ్డి మాట్లాడారు. వ్యాపారంతో పాటు సమాజ సేవలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తున్న వర్తక వ్యాపార వర్గాలు నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం మొదలు నిన్నటి ప్రత్యేక తెలంగాణ ఉద్యమాలకు ఊపిరులూదారని గుర్తుచేశారు. 1969లో జరిగిన తెలంగాణ తొలి దశ ఉద్యమం, 1972లో జరిగిన జై ఆంధ్రా ఉద్యమానికి వ్యతిరేకంగా పోరాటాలు మొదలైంది సూర్యాపేట నుంచేనన్నారు. ఆ తరువాత క్రమంలో 1998 ప్రాంతంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకై తెలంగాణ జనసభ పేరుతో వేరు తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదిన నేలకూడా సూర్యాపేటేనని చెప్పారు. అటువంటి గడ్డ మీద నుండే బహుబంధాలను దూరం చేసుకొని బొమ్మగాని ధర్మభిక్షం, ఆస్తి పాస్తులను వదులు కొని భీంరెడ్డి నరసింహారెడ్డి, నిజాయితీకి ప్రతిబింబంగా నిలిచిన ఉప్పల మల్సూర్ సూర్యాపేట బిడ్డలు కావడం మనం గర్వ పడే అంశమన్నారు. మొన్నటికి మొన్న సూర్యాపేట జిల్లా కేంద్రంలో బాలభవన్ ఏర్పడింది అంటే అది ముమ్మాటికి వనమా వెంకట్రామయ్య గొప్పతనం వల్లేనని కొనియాడారు. వారిని స్మరించుకునేందుకే ఈనెల 16న సూర్యాపేటలో సేవాంకిత సభను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. వనమా వెంకట్రామయ్య, గుండా వెంకటప్పయ్యలను స్మరించుకోవడం తోపాటు గతంలో సీఎం కేసీఆర్ ఆవిష్కరించి రోడ్డు విస్తరణతో తొలగించిన కేసీ గుప్తా విగ్రహాన్ని మరలా అదేరోజు ఆవిష్కరిస్తామని మంత్రి జగదీష్‌రెడ్డి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మీలా మహాదేవ్, మోరిశెట్టి శ్రీనివాస్, ఉప్పల ఆనంద్, తోట శ్యామ్, బండారు రాజా, రాచర్ల కమలాకర్, మీలా వంశీ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లలితా ఆనంద్, గుండా శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ బృందాల తనిఖీ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా శుక్రవారం విద్యుత్ విజిలెన్స్ బృందాలు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించాయి. 16 బృందాలు అన్ని గ్రామాల్లో 492 సర్వీసులను తనిఖీ చేశాయి. ఈ సందర్భంగా విద్యుత్ చౌర్యం, మీటర్లు లేకపోవడం వంటివాటిపై 72 కేసులు నమోదు చేసినట్లు నాగారం సబ్ డివిజన్ ఏడీఈ అరుణ్‌కాంత్, మండల ఏఈఈ వాస శ్రీకాంత్ తెలిపారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు. ప్రతి ఇంట్లో విద్యుత్ మీటర్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ, రూరల్ ఏడీఈలు ఎల్.శ్రీనివాసరావు, రాములునాయక్, డీపీఈ వింగ్ ఏఈఈలు ఎల్.రవి, ఆర్.తేజస్వి, డి.రమాదేవి, సబ్ ఇంజనీర్ అనుములపురి గిరిబాబు సిబ్బంది పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి



కలెక్టరేట్‌లో మొక్కలను పరిశీలిస్తున్న కలెక్టర్



మార్కెట్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ ఎస్.వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఈనెల 24న సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్న జిల్లా సమీకృత కలెక్టరేట్ సముదాయం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావు ఆదేశించారు. శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్లతో కలిసి ఆయన సూర్యాపేటలో నూతన కలెక్టరేట్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను పరిశీలించారు. అనంతరం తన చాంబర్‌లో సుందరీకరణ లైటింగ్ ఏర్పాట్లపై కాంట్రాక్టర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనులను అధికారులు నిరంతర పర్యవేక్షించాలన్నారు. ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ సముదాయాన్ని పరిశీలించి మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి ఎస్‌ఈ నరసింహనాయక్, ఈఈ యాకోబ్, ఏఈఈ ప్రీతి, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ సేకరణలో అలసత్వం వద్దు
కస్టమ్ మిల్లింగ్ రైస్ అందించడంతో మిల్లర్లు, సేకరించడంలో అధికారులు అలసత్వం చేయొద్దని కలెక్టర్ యస్.వెంకట్రావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సీఎంఆర్ సేకరణ, ఇళ్ల నిర్మాణాల క్రమబద్ధీకరణపై జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిల్లులకు అందించిన ధాన్యం, సేకరించిన సీఎంఆర్‌పై నివేదిక అందించాలన్నారు. సీఎంఆర్ అందించని మిల్లులపై చర్యలు తీసుకోవాలన్నారు. జీఓ 58, 59 ద్వారా అందిన దరఖాస్తులు పరిశీలించి ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాలు అందించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు పాటిల్ హేమంత కేశవ్, మోహన్ రావు, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

ఎనిమిది మందికి పోలీస్ సేవా పతకాలు

సూర్యాపేట క్రైం: న్యూ ఇయర్ డే సందర్భంగా జిల్లాలో వివిధ చోట్లలో పనిచేస్తున్న ఎనిమిది మంది పోలీస్ సిబ్బంది సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రస్థాయి పోలీస్ సేవా పతకాలు ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయని ఎస్పీ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. పోలీస్ పతకాలకు ఎంపికైన వారిలో ఎండీ.జహంగీర్ ఎస్‌ఐ సీసీఎస్ సూర్యాపేట, ఎ.సైదులు ఏఎస్‌ఐ నేరేడుచర్ల, ఎ.శ్రీనయ్య ఏఎస్‌ఐ డీఏఆర్ సూర్యాపేట, భగవాన్ హెడ్‌కానిస్టేబుల్ మోతె, రవీందర్‌రెడ్డి హెడ్ కానిస్టేబుల్ సూర్యాపేట రూరల్, ఎండీ.అజర్‌అలీ హెడ్‌కానిస్టేబుల్ అర్వపల్లి, జి.వెంకన్న ఏఎస్‌ఐ చివ్వెంల, వి.వెంకన్న ఏఎస్‌ఐ సూర్యాపేట రూరల్ ఉన్నారు. పోలీస్ పతకాలకు ఎంపికైన సిబ్బందికి ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

సూర్యాపేట టౌన్: తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలలో నాలుగు, ఐదో తరగతుల్లో ప్రవేశాల కోసం శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ ఎంపికకు జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 126 మంది బాలబాలికలు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తొమ్మిది మోటార్ క్వాలిటీ టెస్టులు నిర్వహించారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10 మంది బాలురు, 10 మంది బాలికలను ఎంపిక చేయనున్నట్లు జిల్లా క్రీడల, యువజన అధికారి బి.వెంకట్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఈ నెల 27న హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీ ఎఫ్ సెక్రటరీ అజయ్‌బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు పి.మల్లేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తోందని, విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు అందించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపగాని రవికుమార్ అన్నారు. శుక్రవారం సూర్యాపేటలోని ధర్మభిక్షం భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఇంత వరకు యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు అందకపోవడం, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. హైదరాబాద్‌లో ఒక ప్రభుత్వ పాఠశాల దుస్థితిని చూసి సీఎం కేసీఆర్ మనమడు హిమాన్షు చలించిపోయారంటే మారుమూల గ్రామాల్లోని స్కూళ్ల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఈ సమావేశంలో గడ్డం నాగరాజు, నందమూరి వేణు, కొనపర్తి యశ్వంత్, నకిరేకంటి ప్రవీణ్, వంశీ పాల్గొన్నారు.

వైద్యాధికారులు సమన్వయంతో పనిచేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, వైద్యాధికారులు


- అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లాలో ఈ నెల 20 నుంచి చేపట్టే నులిపురుగుల నివారణ కార్యక్రమం విజయవంతానికి వైద్యాధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని అన్ని ఆస్పత్రులు, పాఠశాలలు, కళాశాలల్లో 19 సంవత్సరాలలోపు పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు అందించాలని సూచించారు. ముఖ్యంగా జిల్లాలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో తప్పక అమలు చేయాలని సూచించారు. ఐదే సంవత్సరాల పిల్లలకు ఇంద్రధనస్సు కార్యక్రమం ద్వారా గుర్తించి టీకాలు వేయించాలని సూచించారు. అనంతరం నులిపురుగుల నివారణ కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ హర్షవర్ధన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నిరంజన్‌రెడ్డి, డీఐఓ వెంకటరమణ, పీఓ సాహితీ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలి

- ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి జనార్దన్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వర్కర్లను రెగ్యులరైజ్ చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్ అన్నారు. శుక్రవారం సూర్యాపేట పట్టణంలో ఏర్పాటు చేసిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన కార్మికులను నియమించుకొని వారికి కనీస వేతనాలను అమలు చేయకుండా, వారి శ్రమను దోచుకుంటున్నాయన్నారు. కేజీబీవీ, మోడల్ స్కూల్, ఆశ, అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ వర్కర్లు అతి తక్కువ వేతనాలు పొందుతున్నారని, వీరికి ఉద్యోగ భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై ఈనెల 20న హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జాతీయ కార్మిక సంఘాల పిలుపుమేరకు రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు కామళ్ల శ్రీను, నరసింహారావు, దేసోజు మధు, సామ నర్సిరెడ్డి, నాగేల్లి రామ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జనార్దన్

అపరిశుభ్రంగా పల్లెలు

కార్మికుల సమ్మెతో ఎక్కడి చెత్త అక్కడే!
- కాల్వల్లో పేరుకుపోతున్న మురుగు
- అంతటా లోపించిన పారిశుద్ధ్యం
- పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు



చిలుకూరులోని ఓ వీధిలో పేరుకుపోయిన చెత్తాచెదారం

మొత్తం మండలాలు	గ్రామ పంచాయతీలు
23	475
జిల్లాలో పనిచేస్తున్న కార్మికులు 1,878 మంది	

చిలుకూరు: పంచాయతీ కార్మికులు సమ్మె కారణంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్మికులు తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో గ్రామాల్లో చెత్త సేకరించే వారు లేక వీధులు, రహదారులపై ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. ఫలితంగా గ్రామాలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. అసలే వానాకాలం కావడం.. సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉండడంతో గ్రామీణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

2020లో మల్టీపర్పస్ వర్కర్ల నియామకం..
రాష్ట్ర ప్రభుత్వం 2020లో గ్రామాల్లో మల్టీపర్పస్ వర్కర్లను నియమించింది. జనాభా దామాషా ప్రకారం ఒక్కో గ్రామ పంచాయతీలో ఇద్దరు నుంచి నలుగురు చొప్పున అధికారులు నియమించారు. వీరు రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు చెత్త తొలగించడంతో పాటు ఇతర పనులు చేస్తుంటారు. అయితే తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లాలోని పంచాయతీ కార్మికులంతా సమ్మెలోకి వెళ్లడంతో మురుగు కాల్వల శుభ్రత ఇంటింటి చెత్త సేకరణ, డంపింగ్‌యార్డుల నిర్వహణ, హరితహారంలో మొక్కలకు నీళ్లు పోయడం లాంటి తదితర పన్నులన్నీ నిలిచిపోయాయి. యంత్రాగం మాత్రం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నట్లు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో ఎవరూ కనిపించడం లేదు. సమ్మె ఇలాగే కొనసాగితే గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి సీజనల్ వ్యాధుల బారిన పడక తప్పదని ప్రజలు అంటున్నారు.

మా డిమాండ్లు నెరవేర్చాలి



"పంచాయతీ కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నా కనీస వేతనం ఇవ్వట్లేదు. ఇప్పటికైనా నెలకు కనీస వేతనంగా రూ.25 వేలు చెల్లించాలి. ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా సౌకర్యాలు కల్పించాలి. ప్రభుత్వం మా డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తాం."
– కట్టెకోల శ్రీనివాస్‌రావు, జీపీ కార్మికుల సంఘం అధ్యక్షుడు, చిలుకూరు మండలం

సమ్మె విరమణే పరిష్కారం..
గ్రామాల్లో తొమ్మిది రోజులుగా పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండడంతో ప్రజలతో పాటు సర్పంచ్‌లు, కార్యదర్శులు, పంచాయతీ అధికారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ వీధుల్లో చెత్త తొలగించాలని ప్రజలు గగ్గోలు పెడుతున్నారని సర్పంచ్‌లు వాపోతున్నారు. ప్రత్యామ్నాయంగా ఎవరైనా కార్మికులను తీసుకుందామంటే పారిశుద్ధ్య పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని వివిధ గ్రామాల సర్పంచ్‌లు అంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంచాయతీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించి సమ్మె విరమణ చేయిస్తేనే గ్రామాల్లో చెత్త, మురుగు సమస్యలకు పరిష్కారం లభించనుందని పలువురు అంటున్నారు.

క్లుప్తంగా

శాస్త్రోక్తంగా నృసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యాగ్నిహోత్రి, మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం జరిపారు. స్వామిఅమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోలు మహోత్సం నిర్వహించారు. ఆ తర్వాత కల్యాణం జరిపించి భక్తులకు తీర్థప్రసా దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు ఉన్నారు.

అందరికీ న్యాయం చేస్తున్నాం

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



యాదగిరిగుట్టలో దుకాణాదారులతో డ్రా తీయిస్తున్న ప్రభుత్వ విప్ సునీత

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం అభివృద్ధితో పాటు పట్టణంలో రోడ్డు విస్తరణకుగాను ఇళ్లు, దుకాణాలు, భూములు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ విడతల వారీగా న్యాయం చేస్తున్నామని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత తెలిపారు. యాదగిరిగుట్ట పట్టణంలో రోడ్డు విస్తరణలో భాగంగా వైకుంఠద్వారం నుంచి పాతగుట్ట చౌరస్తా వరకు దుకాణాలు కోల్పోయిన 139మంది బాధితులకు శుక్రవారం స్థానికంగా డ్రా పద్ధతిలో దుకాణాలు కేటాయించారు. ఈ సందర్భంగా విప్ సునీత మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ జ్యోతి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధా, కౌన్సిలర్ తాళ్లపల్లి నాగరాజు, కోఆప్షన్ సభ్యులు గోర్ల పద్మ, డిప్యూటీ తహసీల్దార్ నర్సింహారావు తదితరులున్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో మాదిగలకు అన్యాయం

- మంద కృష్ణమాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ, చిత్రంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేలు తదితరులు

తుంగతుర్తి: బీఆర్‌ఎస్ పాలనలో మాదిగలకు ప్రతి చోటా అన్యాయం జరుగుతోందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆరోపించారు. శుక్రవారం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేలు జన్మదినం సందర్భంగా మండల కేంద్రంలోని ధనలక్ష్మిఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ 2014 ఎన్నికల్లో దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పి మాదిగలను మోసం చేశారన్నారు. తెలంగాణ ఉద్యమంలో సీఎం కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేస్తే ఆ ఉద్యమాన్ని బతికించింది మాదిగలేనన్నారు. ఏబీసీడీ వర్గీకరణ కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని అడిగితే అక్రమంగా తనను అరెస్టు చేసి, జైలులో పెట్టించారని విమర్శించారు. నాడు ప్రాంతీయ వాదం కావాలని పోరాటం చేస్తే, తెలంగాణ వచ్చాక తుంగతుర్తి నియోజకవర్గంలో స్థానికేతరుడైన గాదరి కిషోర్‌కుమార్‌కు అసెంబ్లీ టికెట్ ఇవ్వడం ఎంత వరకు సమంజసమన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేసిన మందుల సామేలుకు టికెట్ ఎందుకు నిరాకరించారని ప్రశ్నించారు. రెండు సార్లు టికెట్ వస్తుందని ఆశించి భంగపడ్డారని, మూడో సారి కూడా తిరుమలగిరిలో జరిగిన కేటీఆర్ సభలో కిశోర్‌ను మూడోసారి గెలిపించాలని కోరడం ఎంత వరకు సబబన్నారు. మందుల సామేలుకు అడుగడుగునా అవమానం జరగడంతో పార్టీకి రాజీనామా చేసి బయటకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మాదిగల ఐక్యత చాటేందుకు ఆగస్టు రెండో వారంలో మాదిగల విశ్వరూపం బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మాదిగలు ఏకతాటిపైకి వచ్చి మాదిగల పట్ల వివక్షత చూపుతున్న సీఎం కేసీఆర్‌ను గద్దెదించాలని పిలుపునిచ్చారు.

అవమానాన్ని భరించలేకే బీఆర్‌ఎస్‌కు రాజీనామా : మందుల సామేలు

బీఆర్‌ఎస్ పార్టీలో తనకు జరిగిన అవమానాన్ని భరించలేకే పార్టీకి రాజీనామా చేసి బయటకు వచ్చానని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తుంగతుర్తి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తానని, ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. అంతకుముందు తెలంగాణ తల్లి, అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పించి, భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మందుల సామేలు జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఓరుగంటి సత్యనారాయణ, పూసపల్లి భిక్షం, శ్రీనివాస్‌నాయక్, కందుకూరి సోమయ్య, రవి, సైదులు, శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన పెంచుకోవాలి

- ఎన్డీఆర్‌ఎఫ్ కమాండర్ ముఖేష్‌కుమార్



అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ అధికారి

చౌటుప్పల్: విపత్తులు చోటు చేసుకున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఎన్డీఆర్‌ఎఫ్ కమాండర్ ముఖేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ మద్దిలేటి అన్నారు. 18మంది సభ్యులు గల ఎన్డీఆర్‌ఎఫ్ బృందం శుక్రవారం చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి గ్రామాన్ని సందర్శించింది. కలెక్టర్ సూచన మేరకు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విపత్తులు సంభవించినప్పుడు ఏ విధంగా స్పందించాలన్న విషయంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ విపత్తులు వచ్చినప్పుడు ప్రతి ఒక్కరు ముందుగా తమను తాము కాపాడుకునే విధంగా అవగాహన ఉండాలన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు గాయపడిన వారికి చికిత్స అందించడం, గుండెపోటు సంభవిస్తే సీపీఆర్ చేసే విధానాలను తెలుసుకోవాలన్నారు. సర్పంచ్ బాతరాజు సత్యం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీఓ నర్సింహారావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రావు, ప్రధానోపాధ్యాయుడు మురళీమోహన్, బాలరాజు, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ కమలాకర్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఉపసర్పంచ్ బోయ లింగస్వామి, తదితరులున్నారు.

రైస్ ఇండస్ట్రీలో బాహుబలి

వరిసాగులో ఉమ్మడి నల్లగొండ జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉంది. దిగుబడి కూడా గణనీయంగా వస్తోంది. వరి దిగుబడికి తగ్గట్టుగా మిల్లింగ్ చేసేందుకు కూడా భారీ స్థాయిలో రైస్ మిల్లులు వెలుస్తున్నాయి. రూ. వంద కోట్ల పెట్టుబడితో.. అధునాతన టెక్నాలజీ మిషనరీతో నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని హాలియా సమీపంలో ఏర్పాటైన వజ్రతేజ రైస్ క్లస్టర్.. రైస్ ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షిస్తోంది. రోజుకు 640 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ చేసి 450 మెట్రిక్ టన్నుల బియ్యం ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఈ మిల్లు సొంతం.

– నల్లగొండ డెస్క్



హాలియా సమీపంలో ఏర్పాటైన భారీ రైస్ మిల్లు

- హాలియా వద్ద రూ.వంద కోట్లతో రూపుదిద్దుకున్న రైస్ క్లస్టర్
- ఉమ్మడి జిల్లాలో నూతన టెక్నాలజీతో మిల్లుల విస్తరణ
- నాణ్యమైన బియ్యం ఉత్పత్తి.. విదేశాలకు సైతం ఎగుమతి
- 90 శాతం ధాన్యం స్థానికంగానే కొనుగోలు చేస్తున్న మిల్లర్లు
- హెచ్‌ఎంటీ, జైశ్రీరాం, తెలంగాణ సోన రకాలకు డిమాండ్

ఆసియాఖండంలోనే అత్యధిక రైస్ మిల్లులు ఉన్న ప్రాంతంగా మిర్యాలగూడకు పేరుంది. నల్లగొండ జిల్లాలో ఉన్న వనరులు ఆధారంగా చాలా కాలం క్రితమే ఇక్కడ రైస్ మిల్లులు విస్తరించాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఆయకట్టుతో పాటు మూసీ, ఎస్సారెస్పీ–2 ఆయకట్టు పరిధిలో పదేళ్లలో వరి సాగు విస్తీర్ణం పెరిగింది. భూగర్భ జలాలు పెరిగి నీటి లభ్యత బాగుండడంతో నాన్ ఆయకట్టులో బోరుబావుల కింద కూడా వరి పంట సమృద్ధిగా పండుతోంది. గత సంవత్సరం వానాకాలం సీజన్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 12,74,288 ఎకరాల్లో వరి పంట సాగు కాగా.. 28,49,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. యాసంగిలో 13,12,800 ఎకరాల్లో వరి సాగైతే.. 32,55,400 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది. ఇందులో మెజారిటీ ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) కింద రైస్ మిల్లులకు ఇచ్చింది. మరికొంత ధాన్యాన్ని మిల్లర్లు నేరుగా కొన్నారు. మన జిల్లాలోని ధాన్యాన్ని ఇక్కడే మిల్లింగ్ చేసేందుకు రైస్ మిల్లులు భారీ స్థాయిలో వెలుస్తున్నాయి. సరికొత్త టెక్నాలజీతో ఒక్క రోజులో అత్యధిక ధాన్యం మిల్లింగ్ చేసే సామర్థ్యంతో హాలియా సమీపంలో భారీ రైస్ మిల్లు ఏర్పాటైంది.



వజ్రతేజ రైస్ మిల్లు

తెలంగాణ బియ్యానికి డిమాండ్



రైస్ ప్రాసెసింగ్

తెలంగాణ బియ్యానికి మార్కెట్‌లో డిమాండ్ ఉంది. క్వాలిటీ పరంగా జైశ్రీరాం, సోనామసూరి, హెచ్‌ఎంటీ, తెలంగాణ సోన రకాలు బాగున్నాయి. ఇతర రాష్ట్రాలతో పాటు విదేశాలకు కూడా మన బియ్యం ఎగుమతి అవుతున్నాయి. 1010 రకం దక్షిణాఫ్రికాకు, జైశ్రీరాం రకం అమెరికా, అరబ్ దేశాలకు వెళ్తున్నాయి. అదేవిధంగా తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలకు జైశ్రీరాం రకం బియ్యం ఎగుమతి ఎక్కువగా ఉంది. స్టీమ్ రైస్‌కు ఇండియాలోనే డిమాండ్ ఉంది. బాయిల్డ్ రైస్ ఈస్ట్ ఆఫ్రికా దేశాలకు వెళ్తుంది.

ధాన్యం స్థానికంగానే కొనుగోలు



రైస్ మిల్లులో ధాన్యం దిగుమతి

ఇంత పెద్దమొత్తంలో బియ్యం ఉత్పత్తి చేసేందుకు ధాన్యాన్ని 90 శాతం స్థానికంగానే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కొనుగోలు చేస్తున్నారు. కొంత ధాన్యం నిజామాబాద్, ఏపీలోని నెల్లూరు నుంచి కొనుగోలు చేసి తీసుకు వస్తున్నారు. మిల్లు నడిచేందుకు రోజుకు సుమారు 40వేల యూనిట్ల విద్యుత్ అవసరం ఉంటుంది. అందులో 15వేల యూనిట్ల విద్యుత్‌ను స్వయంగా ఉత్పత్తి చేసుకుంటున్నారు. స్టీమ్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసుకునేందుకు ప్రత్యేకంగా ప్లాంట్ ఉంది.

ఐదు సంవత్సరాల శ్రమ



ఆధునిక టెక్నాలజీతో రైస్ క్లస్టర్ ఏర్పాటుకు ఐదు సంవత్సరాలు కష్టపడ్డా. వివిధ రాష్ట్రాలు తిరిగి మిషనరీలపై అధ్యయనం చేశాను. రూ.100 కోట్లతో అతిపెద్ద మిల్లు ఇక్కడ ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు కూడా లాభదాయకమే. వరి హార్వెస్టింగ్ చేసి నేరుగా ధాన్యాన్ని ట్రాక్టర్లలో మిల్లుకు తీసుకువస్తున్నారు. దళారీ వ్యవస్థ ఏమీలేకుండా రైతుకు మద్దతు ధరకు మించి ఇస్తున్నాం. మిల్లు నుంచి కాలుష్యం లేకుండా బ్యాక్ ఫిల్టర్ సిస్టమ్‌తో పొల్యూషన్ కంట్రోల్ చేస్తున్నాం. ధాన్యం మిల్లింగ్ చేసి 'వజ్రతేజ రైస్' పేరుతో బియ్యం మార్కెటింగ్ చేస్తున్నాం. హైదరాబాద్‌లో ఔట్‌లెట్‌లు పెడుతున్నాం. ఎక్కువ మొత్తంలో బియ్యం అవసరం ఉన్న వారికి నేరుగా సరఫరా చేస్తున్నాం.

– చిట్టిపోలు యాదగిరి, వజ్రతేజ రైస్ క్లస్టర్ యజమాని



గంటకు 32 టన్నుల ధాన్యం మిల్లింగ్

గంటకు 32 మెట్రిక్ టన్నుల చొప్పున రోజుకు 20 గంటలపాటు 640 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ చేసి 450 టన్నుల బియ్యం ఉత్పత్తి చేస్తున్నారు. రా రైస్, స్టీమ్ రైస్, బాయిల్డ్ రైస్, డబుల్ బాయిల్డ్ రైస్.. ఇలా నాలుగు విధాలుగా బియ్యం ఉత్పత్తి చేస్తున్నారు. స్టీమ్ రైస్‌కు మార్కెట్ ఎక్కువగా ఉంది. స్టీమ్ రైస్ తీసేందుకు 'అగ్రి ప్రాసెస్ ఇన్నోవేషన్ టెక్నాలజీ' (ఏపీఐటీ) వాడుతున్నారు. ఈ టెక్నాలజీ వల్ల బియ్యం నాణ్యతగా వస్తాయి. అన్నం బాగా ఉడుకుతుంది. బాయిల్డ్‌లో 'జెల్ కుక్ సిస్టమ్' ఉపయోగిస్తున్నారు. ఈ టెక్నాలజీ వల్ల గింజ విరుగుడు చాలా తక్కువ. నూక శాతం తక్కువ. ధాన్యం మిల్లింగ్ కోసం జపాన్ టెక్నాలజీ గల 'సటాకె' కంపెనీ మిషన్లు ఏర్పాటు చేశారు. ధాన్యాన్ని మిల్లులోనే నిల్వ చేసుకునేందుకు పెద్దవి నాలుగు 'సైలోస్'లు ఇటలీ టెక్నాలజీతో నిర్మించారు.



కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్‌తోనే..

ఈ రైస్ క్లస్టర్‌లో మ్యాన్‌పవర్ తగ్గించి.. కంప్యూటర్ ఆపరేటింగ్ సిస్టమ్‌తోనే మిషనరీలను నడుపుతున్నారు. ప్రాసెస్‌లో ఒక్కో దశ వద్ద కమాండ్ కంట్రోల్ మాదిరిగా ప్యానల్ బోర్డులు ఉన్నాయి. వాటి వద్ద ముగ్గురు నుంచి నలుగురు ఉంటారు. మిషన్‌లో ఎంత ధాన్యం, ఏ దశలో, ఏ విధంగా ప్రాసెస్ అవుతుందో అంతా ప్యానల్ బోర్డులో చూసి ఆపరేట్ చేస్తారు. కూలీలు బిహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల వారు ఉన్నారు. మిషనరీ విభాగంలో ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ వారు పనిచేస్తున్నారు.

మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన కేసులో వ్యక్తి రిమాండ్

మోత్కూరు: మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో ఓ వ్యక్తి కోర్టులో హాజరుకాకపోవడంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా.. 14 రోజుల రిమాండ్ విధించింది. మోత్కూరు మండలంలోని పాడిచేడు గ్రామానికి చెందిన జిట్ట అంజయ్య అలియాస్ ఆంజనేయులు అనే వ్యక్తి 2018లో మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో కేసు నమోదైంది. రామన్నపేట ప్రిన్సిపాల్ జేఎఫ్‌సీఎం కోర్టులో విచారణకు హాజరుకాకపోవడంతో పోలీసులు అతడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. అంజయ్యకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిందని ఎస్‌ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

డిండి: పురుగుల మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. డిండి పట్టణానికి చెందిన నల్లగంతుల లక్ష్మయ్య(45) తన కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో మానసిక్షోభకు గురై ఈనెల 4న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

గ్యాస్ సిలిండర్ లీక్.. ఇల్లు దగ్ధం



కాలిపోయిన సామగ్రి

తుంగతుర్తి: గ్యాస్ సిలిండర్ లీకేజీతో మంటలు వ్యాపించి ఇల్లు దగ్ధమైన సంఘటన శుక్రవారం వెంపటి గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. వెంపటి గ్రామానికి చెందిన గుండగాని నరేష్ ఇంట్లో తన తల్లి శుక్రవారం రాత్రి వంట చేసేందుకు గ్యాస్ స్టవ్ వెలిగించింది. గ్యాస్ లీక్ కావడంతో మంటలు చెలరేగాయి. దీంతో భయాందోళనకు గురైన ఆమె బయటకు పరుగులు తీసింది. మంటలు అంటుకుని ఇంట్లో ఉన్న సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు నీళ్లు చల్లి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.లక్ష వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు.

ఉరేసుకొని డ్యాన్స్ మాస్టర్ ఆత్మహత్య



దార సురేష్ (ఫైల్)

కోదాడరూరల్: ఉరేసుకొని డ్యాన్స్‌మాస్టర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కోదాడ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొమరబండలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దార సురేష్(30) డ్యాన్స్‌మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. వివాహం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. అతడి స్నేహితుడు ఇంటికి వెళ్లగా తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూడగా ఉరి వేసుకుని ఉన్నాడు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని, కిందకు దించి చూసే వరకు సురేష్ మృతి చెంది ఉన్నాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై మృతుడి సోదరుడు బొబ్బిలిరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రెండు బైకులు ఢీ..

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



మృతిచెందిన ప్రసాదరావు (ఫైల్)

హుజూర్‌నగర్: రెండు బైకులు ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన హుజూర్‌నగర్ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని దీక్షిత్‌నగర్ కాలనీకి చెందిన కత్తింటి ప్రసాదరావు (63) తన బంధువు డిగమర్తి శ్రీనివాస్‌తో కలిసి ద్విచక్రవాహనంపై పొలానికి వెళ్తున్నాడు. ఈక్రమంలో పట్టణ శివారులోని రామినేని పెట్రోల్ బంక్ సమీపానికి రాగానే చిలుకూరుకు చెందిన తిరుపతి బైక్‌పై హుజూర్‌నగర్ వైపు రాంగ్ రూట్‌లో వేగంగా వచ్చి వీరి వాహనాన్ని ఢీ కొట్టాడు. దీంతో ప్రసాదరావుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన శ్రీనివాస్‌ను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి కోదాడకు తరలించారు. మృతుడి కుమారుడు కత్తింటి చైతన్యకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

నకిరేకల్: తేనెటీగల దాడిలో నలుగురు ఉపాధి హామీ కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన నకిరేకల్ మండలం కడపర్తి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కడపర్తికి చెందిన ఉపాధి కూలీలు గుండ్లపల్లి జ్యోతి, జిల్లా మల్లయ్య, దాసరి రాములమ్మ, భూపతి మల్లయ్య గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కల పాదుల స్థానంలో వేరే మొక్కలు నాటేందుకు ట్రాక్టర్‌లో బయలుదేరారు. అదే సమయంలో వర్షం రావడంతో ట్రాక్టర్‌ను దారిలో ఉన్న మర్రిచెట్టు కింద కొద్దిసేపు ఆపారు. ట్రాక్టర్ ఇంజన్ ఆన్‌లో ఉండటంతో సైలెన్సర్ నుంచి పొగ చెట్టుమీదకు వెళ్లింది. దీంతో చెట్టు కొమ్మలకు తేనెతెట్టె ఉండటంతో ఈగలు ఒక్కసారిగా వీరిపై దాడి చేశాయి. గాయాలు కావడంతో వీరిని నకిరేకల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నల్లగొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వస్తువుల నాణ్యతా ప్రమాణాలపై శిక్షణ

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామంలో గల ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో శుక్రవారం భారతీయ ప్రమాణాల సంస్థ(బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో 9వ, 10వ తరగతి విద్యార్థులకు వస్తువుల నాణ్యతా ప్రమాణాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు నిత్యం వాడే వస్తువుల నాణ్యతా ప్రమాణాలు, వాటిని ఏవిధంగా పరీక్షించాలనే అంశాలతోపాటు బంగారు ఆభరణాలపై హాల్‌మార్కింగ్, నాణ్యతను పరీక్షించే విధానం తదితర అంశాలను వివరించారు. అనంతరం విద్యార్థులకు బిస్కెట్ ప్రమాణాలపై పరీక్షలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఉపాధ్యాయురాలు సంధ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భారతీయ ప్రమాణాల సంస్థ హైదరాబాద్ శాఖ విశ్రాంత డైరెక్టర్ ప్రభాకర్, ఏఎస్ఎస్‌పీ శాస్త్రి, గ్రాడ్యుయేట్ ఇంజనీర్ టెక్నికల్ (జీఈటీ) సుహాసిని ప్రకాష్, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చిరంజీవి, ఉపాధ్యాయులు రాధిక, విద్యార్థులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ ఉద్యోగి ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకొని బలవన్మరణం
- ఏడాది కిత్రం భర్త మృతి
- అనాథలుగా మారిన చిన్నారులు



పుష్పలత (ఫైల్)

హాలియా: మిషన్ భగీరథలో పనిచేస్తున్న ఓ కాంట్రాక్టు ఉద్యోగిని ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన హాలియా మున్సిపాలిటీలోని సాయిప్రతాప్ నగర్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తిరుమలగిరి(సాగర్) మండలంలోని అల్వాల గ్రామానికి చెందిన సింగం పుష్పలత (26)కి చిన్నవయసులోనే తల్లిదండ్రులు చనిపోయారు. మేనమామ అయిన జోలం సాంబయ్య ఆమెను పెంచి పెద్దచేశాడు. పుష్పలతను ఎనిమిదేళ్ల క్రితం నల్లగొండలోని పానగల్‌కు చెందిన సింగం మహేష్‌కి ఇచ్చి వివాహం జరిపించాడు. మహేష్ పానగల్‌లోని మిషన్ భగీరథలో కాంట్రాక్టు పద్ధతిలో కంట్రోల్ రూం ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. వీరికి కుమార్తె సాన్విత, కుమారుడు సాయినందన్ ఉన్నారు. మహేష్‌కు వచ్చే జీతం సరిపోకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో గతేడాది ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భర్త మృతి చెందడంతో పుష్పలతకు హాలియా మిషన్ భగీరథలో కాంట్రాక్టు ఉద్యోగిగా అవకాశం కల్పించారు. ఈమె 6 నెలల క్రితం హాలియా పట్టణంలోని సాయిప్రతాప్ నగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ విధులు నిర్వహిస్తోంది. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. ఇంటి యజమాని గమనించి బంధువులు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండలోని ఏరియా ఆస్పత్రికి తరలించి, అనంతరం బంధువులకు అప్పగించారు. మృతురాలు మేనమామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు. కాగా.. ఏడాది క్రితం తండ్రి, ఇప్పుడు తల్లిని కోల్పోయి ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారారు.

సూసైడ్ నోట్‌లో ఇలా ఉంది..

పుష్పలత మృతదేహం సమీపంలో సూసైడ్ నోట్ కనిపించింది. అందులో తన చావుకు ఎవరూ కారణం కాదని, మిషన్ భగీరథలో చేసే ఉద్యోగానికి తనకు వచ్చే జీతం రూ. 9,500లు సరిపోకపోవడం, అది కూడా రెండు, మూడు నెలల వరకూ రాకపోవడంతో ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నానని పేర్కొని ఉంది. తన కడుపులో గడ్డ కావడంతో వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు ఆపరేషన్‌కు రూ. 2లక్షలు ఖర్చు అవుతుందనడంతో ఆర్థిక స్థోమత లేక ఆత్మహత్య చేసుకుంటున్నానని రాసి ఉంది.

చిన్నారులను ఆదుకోవాలి

నల్లగొండ క్రైం: నెల వారి జీతం సక్రమంగా ఇవ్వకపోవడంతోనే ఆర్థిక ఇబ్బందుల కారణంగా మిషన్ భగీరథ 35 ఎంఎల్‌డీలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న సింగం పుష్పలత ఆత్మహత్య చేసుకుందని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గత 6నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, ఇందులో అధికారుల నిర్లక్ష్యం ఉందన్నారు. ఈమేరకు నల్లగొండ ఎస్పీని కలిసి బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలని కోరారు. ఆత్మహత్యకు ముందు రాసిన సూసైడ్ నోట్‌ను వారికి అందజేశారు. పుష్పలత భర్త మహేష్ 10 నెలల క్రితం ఆత్మహత్య చేసుకోగా.. ఇప్పుడు భార్య పుష్పలత ఆత్మహత్య చేసుకుందన్నారు. చిన్నారుల అనాథలుగా మారారన్నారు. కార్మికుల వేతనం రూ.19 వేలు ఇవ్వాల్సి ఉండగా రూ.9వేలు ఇవ్వడం అన్యాయమన్నారు. కార్మికుల పొట్ట కొడుతున్నప్పటికీ అధికారులు, మంత్రి, ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

రెండిళ్లలో చోరీ

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రవీంద్రనగర్‌లో గల వైదేహి టౌన్‌షిప్‌లో గురువారం అర్ధరాత్రి సమయంలో రెండిళ్లల్లో చోరీ జరిగింది. ఎస్‌ఐ దోరేపల్లి నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుక వెంకట్‌రెడ్డి తన ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు లోపలికి ప్రవేశించి ఇంట్లో ఉన్న సుమారు 8 తులాల బంగారం, రూ.3.70లక్షల నగదు, అదేవిధంగా జిన్నె శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో రూ.40వేల నగదు చోరీ చేశారు. బాధితులు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమాజ శ్రేయస్సుకు 490 రోజులుగా సైకిల్ యాత్ర



యాదగిరిగుట్టకు చేరుకున్న విజయ్ గోపాల్ కృష్ణ

యాదగిరిగుట్ట: దేశ శాంతి.. దైవ దర్శనం.. సైకిల్ యాత్ర.. కాశీ రామేశ్వరం అనే ఉద్దేశంతో సమాజ శ్రేయస్సుకు కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లాలోని సింధనూర్‌కు చెందిన చాత్రాజుల విజయ్‌గోపాల్ కృష్ణ సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ యాత్ర శుక్రవారం రాత్రి యాదగిరిగుట్ట పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల, జంతు, వన సంరక్షణకు యాత్ర చేపట్టినట్లు తెలిపారు. సైకిల్ యాత్రను గతేడాది మార్చి 11న కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు జిల్లా సింధనూరు నుంచి ప్రారంభించానని చెప్పారు. ప్రధానంగా షిర్డీ, గంగా, యమునా, సరస్వతి, హర్యానా, పంజాబ్, రాజస్థాన్, ఢిల్లీ, కర్ణాటక, మైసూర్, తమిళనాడు, చెన్నై, శ్రీరంగ పట్నం, దర్మస్థల, విజయవాడ, ౦టి ప్రాంతాలను సందర్శించి తెలంగాణాలోని భద్రాచలం, మేడారం, కాళేశ్వరం మీదుగా యాదాద్రీశుడి ఆలయానికి చేరుకున్నట్లు తెలిపారు. సుమారు 490 రోజులుగా 11 ప్రముఖ నదులు, పుణ్య దేవాలయాలను దర్శించుకొని వస్తున్నట్లు వెల్లడించారు.